
టిడ్కో ఇళ్ల నిర్మాణం ఎప్పుడో?



పేదలకు టిడ్కో ద్వారా ఇళ్లు నిర్మించి ఇస్తామని 2018లో టీడీపీ ప్రభుత్వం తెలిపింది. పలువురు పేదలను లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. వారి నుంచి గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో ఇళ్లకు అడుగులను బట్టి రకరాలుగా ధర నిర్ణయించి నగదు కట్టించుకుంది. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి అందజేస్తామని తెలిపింది. ఆరేళ్లు అవుతున్నా ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. కట్టించుకున్న నగదు వెనక్కి ఇవ్వలేదు. లబ్ధిదారులు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే వున్నారు. వారికి సమాధానం చెప్పే నాథుడు కూడా లేడు.



టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పలమనేరులో అప్పటి మంత్రి వేసిన శిలాఫలకం

- టిడ్కో ఇళ్ల కోసం 2018లో నగదు చెల్లించిన లబ్ధిదారులు
- అప్పట్లోనే ఆగిన ఇళ్ల నిర్మాణం
- కట్టించుకున్న సొమ్మును కూడా వెనక్కి ఇవ్వని వైనం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

పలమనేరు: పేదలకు అపర్డబుల్ హౌసెస్ నిర్మాణాలు చేపడుతున్నట్టు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా రెవెన్యూ, ఏపీ టిడ్కో(ఆంధ్రప్రదేశ్ టౌన్‌షిప్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులు పలమనేరు పట్టణ సమీపంలోని గడ్దూరు వద్ద సర్వే నంబర్లు 1075, 1076, 1069లలో రైతుల నుంచి 8.78 ఎకరాల భూమి సేకరించారు. ఎకరా రూ.25 లక్షల చొప్పున 8.78 ఎకరాలకు రూ.2.25 కోట్లు వెచ్చించారు. అప్పట్లో ఎన్నికల కోడ్ వస్తుందని తెలిసి కూడా నాటి రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రిగా వున్న అమరనాథ రెడ్డి 2019 ఫిబ్రవరి 17న శంకుస్థాపన చేశారు. 400 మంది లబ్ధిదారులను సైతం ఎంపిక చేశారు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌కు అడుగులను బట్టి ఇళ్లకు వివిధ ధరలు నిర్ణయించారు. ఎంపికైన వారిలో 42 మంది రూ.50 లక్షల వరకు మున్సిపాలిటీ అధికారులకు చెల్లించారు. అధికారులు, ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. ఎన్నికల కోడ్ రావడం, ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవడంతో ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది. ఇప్పటికీ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా తాము చెల్లించిన నగదు వెనక్కి వస్తోందేమోనని పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇళ్లకోసం లబ్ధిదారుల ఎదురుచూపులు

టిడ్కో ఇళ్ల కోసం డబ్బు చెల్లించిన పేదలు అధికారుల చుట్టూ తిరుగుతూనే వున్నారు. తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేకుంటే తాము కట్టిన నగదు తిరిగి చెల్లించాలని కోరుతూనే వున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మున్సిపల్ పాలకవర్గం ఇళ్ల కోసం లబ్ధిదారులు చెల్లించిన నగదును వెనక్కి ఇవ్వాలంటూ తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించింది. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల్లో ఆశలు చిగురించాయి. ఇప్పటికైనా తాము కట్టిన డబ్బులు ఇవ్వండి మహాప్రభో అంటూ కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌పై విజిలెన్స్ విచారణ

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలం గానుగచింత గ్రామ పంచాయతీ లోకవారిపల్లె సమీపంలో శనివారం రాత్రి విద్యుత్ షాక్‌తో కార్మికుడు తీవ్రంగా గాయపడిన ఘటనపై ఆదివారం విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఎల్‌సీ తీసుకున్నారా లేదా? ప్రమాదం ఎలా జరిగింది. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. కార్మికుడు అల్‌మేన్ ఉమేన్ శనివారం ఉదయం నుంచి పని చేస్తున్నారని, ఉదయం ఎల్‌సీ తీసుకున్నారని తెలుసుకున్నారు. సాయంత్రం పక్కనే విద్యుత్ స్తంభంలో మరికొందరు పనులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరా లేదని అనుకుని పైకి ఎక్కినట్టు వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలోనే అతనికి షాక్ తగిలినట్టు తెలిసింది.

కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీ భరత్‌కు ఆహ్వానం



కౌన్సిలర్ మునిరాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కాణిపాకం ఆలయ అధికారులు

కుప్పం రూరల్: ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాలకు చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌ను ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఆలయ అధికారులు ఆదివారం ఉదయం కుప్పం వచ్చి ఆయన నివాసంలో కలిసేందుకు యత్నించారు. ఎమ్మెల్సీ భరత్ సొంత పనులపై బయటికి వెళ్లడంతో మున్సిపాలిటీ 2వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు మునిరాజుకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఫోన్ ద్వారా భరత్‌ను ఆహ్వానించి వెళ్లిపోయారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు డిప్యూటీ ఎంపీడీవో శారదా దేవి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల వారీగా ప్రగతి నివేదికలతో తప్పకుండా రావాలన్నారు.

గుండెపోటుతో వీఆర్‌వో మృతి



వెంకటరమణ (ఫైల్)

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట గ్రామ సచివాలయంలో వీఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ(45) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం వేకువజామున గుండెపోటు రావడంతో ఇంట్లోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని పలువురు సందర్శించి, సంతాపం తెలియజేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

పెద్దపంజాణి: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకుడు, న్యాయవాది ఎల్.భాస్కర్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ఆ సంఘం నాయకులతో కలిసి నడింపల్లిలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి బోయలు అన్ని రంగాల్లోనూ వెనుకబడి వున్నారని తెలిపారు. ఈ క్రమంలో వారిని ఎస్టీ జాబితాలోకి చేర్చాల్సిన అవసరం వుందని తెలిపారు. బోయలు ఐకమత్యంగా పోరాటాలు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి ఎస్టీ జాబితాలో చేర్చడానికి ప్రయత్నాలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరప్ప, సుబ్రమణ్యం, దొరస్వామి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనం సరళీకృతం చేయాలి

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల్లో మూల్యాంకనాన్ని సరళీకృతం చేయాలని వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర ట్రెజరర్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే బోధనేతర పనులతో టీచర్లు ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పుడు అసెస్‌మెంట్ పుస్తకాలను అప్పజెప్పి పనిభారం పెంచడం సబబు కాదన్నారు. దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగం తప్ప విద్యార్థులకు ఒరిగేదేమీ లేదన్నారు. అంతేగాక విద్యార్థులు బోధనకు పూర్తిగా దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఒక టీచర్ కనీసం 600 పుస్తకాలను మూల్యాంకనం చేయాల్సి వస్తోందని మండిపడ్డారు. ఈ విధానాన్ని సులభతరం చేయకపోతే ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షలు పూర్తిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని రామాపురం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను 9 రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామి వారి ఊరేగింపు కనుల పండువగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం కల్పించారు. అనంతరం దుశ్శాలువాతో సత్కరించారు. ఊరేగింపు కార్యక్రమంలో నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలు ధరించి అలరించారు. కార్యక్రమంలో ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు అశోక్‌బాబు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



రాయలసీమ అధ్యక్షుడికి వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

రొంపిచెర్ల: దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఇర్షాద్ కోరారు. ఆయన ఆదివారం రాయలసీమ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు నారాయణ స్వామికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు పెన్షన్లు ఇవ్వాలన్నారు. అలాగే దివ్యాంగుల పెన్షన్లు తొలగించడం భావ్యం కాదని, ఎంతోమంది దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సదరం సర్టిఫికెట్లను పరిశీలించి న్యాయం చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రై సైకిళ్లు, స్కూటర్లు అర్హులైన దివ్యాంగులకు కాకుండా పక్కదారి పడుతున్నాయని తెలిపారు. నిజమైన లబ్ధిదారులకు అందేలా అధికారులను కోరాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీను, ప్రసాద్, మహ్మదాలీ తదితరులు పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌లకు గుర్తింపు కార్డులు



మెకానిక్‌లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న బండకుమార్

పుంగనూరు: పట్టణంలోని బైక్ మెకానిక్కులకు సీఐ సుబ్బరాయుడు గుర్తింపు కార్డులు అందజేశారు. స్థానిక జెడ్పీ అతిథి గృహంలో ఆదివారం బైక్ మెకానిక్‌ల సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బైక్ మెకానిక్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు బండకుమార్ మాట్లాడుతూ ప్రతి రంగంలోనూ పనిచేసే వారికి గుర్తింపు కార్డు ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలోనే పుంగనూరు పట్టణంలో మెకానిక్‌లుగా పనిచేస్తున్న సుమారు 120 మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశామన్నారు. అలాగే మెకానిక్‌లు సమావేశం నిర్వహించుకునేందుకు అనువుగా కమిటీ హాల్‌కు స్థలం మంజూరు చేసి, నిర్మాణానికి సహాయం చేయాలని అధికారులను కోరారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థిలో పోటీతత్వం ముఖ్యంగా ఉండాలని విజయం విద్యాసంస్థల చైర్మన్ తేజోమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని విజయం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పోటీతత్వం, సృజనాత్మకత అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవరచుకోవాలన్నారు. గత ఆరు రోజులుగా తమ కళాశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్, మహేంద్ర ప్రైడ్ క్లాస్ రూమ్ సంస్థలు సంయుక్తంగా ప్రత్యేక నిపుణులతో శిక్షణ ఇప్పించారన్నారు. పోటీ ప్రపంచంలో విజయం సాధించేందుకు కావాల్సిన మౌఖిక నైపుణ్యం, భావ వ్యక్తీకరణ, సాఫ్ట్‌స్కిల్స్ ప్రదర్శన నైపుణ్యం, ఉద్యోగ నిర్వహణ నైపుణ్యం వంటివాటిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారని తెలిపారు.

రేపు ఉచిత వినాయకుడి విగ్రహాల పంపిణీ

పుంగనూరు: పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉచితంగా వినాయకుడి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు పట్టణ యూత్ నాయకులు తెలిపారు. 11 పుట్టల మట్టిని తెప్పించి అందులో గజమాయము, గోమాయము, పసుపు, చందనం, వట్టివేర్లు, పచ్చకర్పూరం తదితర 21 రకాల పుణ్యశుభ్ర ద్రవ్యాలతో వినాయక ప్రతిమలను తయారు చేసినట్టు తెలిపారు. వాటిని ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ వినాయక విగ్రహాలను తీసుకెళ్లి పూజ చేసుకోవాలని కోరారు.

హిందూ, ముస్లింలతో సమావేశం



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు: పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం సీఐ సుబ్బరాయుడు హిందూ, ముస్లింతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అందరూ వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. నిమజ్జనం సమయంలో ఘర్షణలకు పాల్పడరాదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, ట్రైనీ ఎస్ఐ చందనప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు

గంగవరం: మండలంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్వాతంత్ర్య సమరయోధుడు, పలమనేరు వాసులు రామమూర్తి జ్ఞాపకార్థం ఆయన భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు జయశంకర్ సహకారంతో ఉచిత నేత్ర శిబిరాన్ని నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు జయశంకర్ తెలిపారు. కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు 65 మందికి పరీక్షలు చేసి 15 మందిని ఆపరేషన్ కోసం పీఈఎస్ కళాశాలకు తరలించినట్లు తెలిపారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ట్రెజరర్ పుగలేంది, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వి.కోట కవులకు పురస్కారం



కొరారి వెంకటరత్నం, శాంతకుమారిని సన్మానిస్తున్న ప్రముఖులు

వి.కోట: చిత్తూరులో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్తంగా ముందస్తు తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఇందులో తెలుగు ప్రాభవంపై కవితార్చన చేపట్టారు. వి.కోట మండలానికి చెందిన కొఠారి వెంకటరత్నం, డాక్టర్ గడ్డం శాంతకుమారికి తెలుగుతల్లి జాతీయ పురస్కారం–2025, ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ మత్రిపూడి దేవేంద్రరావు, నారాయణ స్వామి, తోట గోవిందన్, కన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు. వారిని పలువురు మండల ప్రముఖులు అభినందించారు.

28న పలమనేరులో తెలుగు భాషోత్సవాలు

పలమనేరు: స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 28న తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా ముందస్తుగా తెలుగు భాషోత్సవాలు నిర్వహించనున్నట్టు సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా తెలుగు భాషపై వ్యాసాలు రాసి గెలుపొందిన, వంద నీతి పద్యాలు చెప్పగలిగిన వందమంది ఏపీ, తెలంగాణా విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ధ్వజ స్తంభ దారువుకు పూజలు





కేరళ నుంచి వచ్చిన వాహనానికి పూజలు చేస్తున్న భక్తులు, ధ్వజ స్తంభానికి వినియోగంచనున్న దారువుకు పూజలు చేస్తున్న మహిళలు

పలమనేరు: పట్టణంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నూతన గాలిగోపురం, ధ్వజస్తంభం నిర్మాణ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా కేరళ అడవుల నుంచి ఇక్కడికి ధ్వజ స్తంభానికి కావాల్సిన పెద్ద దారువును కంటైనర్‌లో ఆదివారం తీసుకువచ్చారు. ఆ వాహనానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు విశేషంగా అలంకరించి ఊరేగించారు. మరోవైపు పట్టణంలోని ఓంశక్తి భక్తులు పసుపు చీరలు ధరించి పసుపు నీటితో దారువుకు అభిషేకం, అనంతరం క్షీరాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శివాలయ గాలిగోపుర పనులకు నిధులు కేటాయించారు. ఆపై అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో దాతల సాయం ద్వారా ఈ కార్యక్రమాలు సాగుతున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కమలాకర్, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, పట్టణానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

గుడిపాల: మండలంలోని వసంతాపురం సచివాలయంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నట్లు ఏవో సంగీత తెలిపారు. సచివాలయానికి 300 బస్తాలు వచ్చాయన్నారు. ఒక రైతుకు ఒక బస్తా ఇస్తామని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

జాగ్రత్తలు పాటించండి

బంగారుపాళెం: వినాయక చవితి ఉత్సవాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈ దేవిప్రసన్న ఆదివారం తెలిపారు. ఎత్తుగా ఉండే ప్రతిమలు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. జాగ్రత్తలు పాటించాలన్నారు.

సుల్తాన్‌నగర్‌లో వసతులు కరువు

- లోపించిన పారిశుద్ధ్యం
- వ్యాధుల బారిన పడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు



సుల్తాన్ నగర్‌లో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పుంగనూరు: పట్టణ సమీపంలోని నక్కబండలోని సుల్తాన్‌నగర్‌లో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలను శుభ్రం చేయకపోవడంతో మురుగునీరు రోడ్డు పైనే ప్రవహిస్తోంది. దోమలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయి. చిన్నారులు, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. తమ కాలనీలో మంచినీరు సైతం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు అధ్వానంగా మారుతున్నాయని, నడిచేందుకు కూడా వీలులేకుండా వుందని చెబుతున్నారు. కాలువల్లో నీరు వెళ్లేందుకు సైతం వీలు లేకుండ మురుగునీటితో నిండిపోయిందన్నారు. కాలువలు శుభ్రం చేసే విషయమై సచివాలయ అధికారులకు, ఉద్యోగులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేసి, మురుగు కాలువలను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



మహాసభలో పాల్గొన్న పంచాయతీ సిబ్బంది

వి.కోట: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జిల్లా పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య డిమాండ్ చేశారు. వి.కోట పట్టణంలోని ఒక కల్యాణ మండపంలో ఆదివారం పంచాయతీ వర్కర్స్ యూనియన్ 10వ జిల్లా మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఆదాయం లేదనే సాకుతో పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. కార్మికులకు వచ్చే జీతం కుటుంబ పోషణకు చాలడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి కార్మికుల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరారు. అదేవిధంగా కార్మికులు ఐకమత్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గిరిధర్, ఉపాధ్యక్షుడు గంగరాజు, నాయకులు మధు, నాగభూషణం, మల్లయ్య పాల్గొన్నారు.

మరో గ్రంథాలయ ఉద్యమం రావాల్సిందే

- వచ్చే నెల 7న పలమనేరులో పుస్తకంతో నడక
- ప్రముఖ రచయిత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో స్థానిక కవులు, రచయితలు

పలమనేరు: గ్రంథాలయాల అభివృద్ధి కోసం మరో గ్రంథాలయ ఉద్యమం రావాల్సిందేనని పలమనేరు రచయితల సంఘం నాయకుడు, ప్రముఖ రచయుత జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా పలమనేరులో పుస్తకంతో నడక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో ఏపీ గ్రంథాలయ పరిషత్తు సభ్యుడు వీఆర్ రాసాని ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో పుస్తక పఠనం బాగా తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు సైతం సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారారని పేర్కొన్నారు. మనిషి ప్రశాంతంగా ఉండాలన్నా, ప్రశాంతంగా జీవనం సాగించాలన్నా కచ్చితంగా పుస్తకాలు చదవాలన్నారు. అందుకే పుస్తకంతో నడక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో భాగంగా లక్ష్మీ శ్రీనివాస్ కవితా సంపుటి ఎప్పుడొస్తుందో, సప్తస్వాలు పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు యుగంధర్‌బాబు, గ్రంథాలయ అధికారి హేమంత్‌కుమార్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, పలమనేరు బాలాజీ, హైదర్, శీతారామయ్య, మల్లిచెట్ల దేవేంద్ర, దొర్నాదుల సిద్ధార్థ, లక్ష్మీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.